# కొరివితో తలగోక్కుంటారా?

''ఆ బిడ్డ అడగతా ఉండేదేంది? ఇనీ యిన్నట్టుగా నీ పాటికి నువ్వు లేచి సక్కా పోతా ఉండేదేంది? ఇంకేమన్నా అంటే– 'అంతకింతకు రంపు రగలబడి పొయ్యే కొంపలు రతికెక్కేది లేదులే? అంటా యాష్టపోతారు. ఇంతకూ ఆ బిడ్డ ఏమడిగింది? కార్లూ సికార్లూ కావాలనిందా? కంచి పట్టు చీరలే కట్టాలనిందా? లేకుండా బోతే పైనుండి కిందికి నగా నట్రా దిగేయమని అడిగిందా? చదువుకుంటా ఉండే బిడ్డ. అదేందో ఒక పుస్తకమంట. దాన్ని కొనుక్కో వాలంటే బొదులు సదులు పలక్కుండా పోతావుండేదేనా? అయినా అదిగూడా నా మాదిర్తో ఒక ఎర్రిబాగల్ది. 'ఏమి అడగాల. ఎవుర్ని ఏమి అడగ్గాడదు.' అని తెల్సి ఏడిస్తే గదా? పాపం. నిలికిలేని సేద్దమే మొగోడికి. అట్టా యిట్టా గుక్కతిప్పుకోలేకుండా చచ్చి దుగ్గడవతా ఉండాడే? అట్టాంటి మొగోణ్ణి అడిగేదేంది? ఆ మిందట అడిగింది చెయ్‌లేదని ఏడ్సేదెందుకు?''

మా బాశాలి ఉంటే మూసి పెట్నె కోడిపెట్ట మాదిర్తో ఉణ్ణెంత సేపూ ఉలక్కుండా పలక్కుండా ఉండిపోతింతి. కలగన్నెట్టు మేలుకునిందా? ఇంటి ఎనుగాడి మింది కెగిరి నిలబడి రెక్కలు తట్టా కూతేసే కోడిపుంజు ఆపె ముందు దిగదుడుపే గదా? నాసామిరంగా! దండకం ఎత్తుకుంటింది. దండకాన్ని ఎటుమంటి మొనగోడు రాసినా ఎక్కణ్ణో ఒక చోట 'నమస్తేన్నమః' అని ముడువు చెయ్యాల్సిందే. మా బాశాలి దండకం ఎత్తుకుణ్ణిందంటే నాయిన చెరువు మొరవలో నీళ్ల ఎలబెరక్కోని ఎల్లవగట్టి నట్టేగదా? ఆ ఎల్లవలో కొట్టుకోని పోకుండా నిలదొక్కుకోని నిలబడేదంటే అలపసొలపం అయిన పని గాక పాయ. అయినా కట్టెల్లో కంపల్లో కూడా కాలని జల్మమే! ఇట్టాంటి ఎల్లవలు ఎల్లవ మింద ఎల్లవగా వస్తే మాత్రం మనకేమిలే? అనుకుంటా అట్టా యిట్టా జగ్గకుండా నిలబడుకుణ్ణా!

''ఎవురికే చెప్తా ఉండేది? చెవల్లో చెట్లేమన్నా మొల్సినాయా?''

నాకు నవ్వొచ్చె!

''అద్దో! ఆపైపై నవ్వులేగదా పాణానికి చేటు! అదే వద్దంటా ఉండ్లా. ఏమడిగినా యిద్దో యిట్టా ఒక్క నవ్వుతో సరిపెట్టేయాలంటే అదేమీ కుదరదు.చెప్పు. ఆపైపై నవ్వులు ఎందుకో చెప్పు.'' మా బాశాలి నిల్దీసె!

''నీ నోటి వాక్కు చల్లంగా వుంటే యింకేముండాదే? ఈ సీమలో నెలకు మూడు వానలు గదంటే?''

''అంటే?''

''గండిపేట్లో మొనగోడు గెడ్డపారెత్తుకోని ఒక చెట్టు నాట్నాడా? తిరమల కొండ మింద గెవునూరు పార శాతబట్టి ఒక మొక్క నాట్టాడా? అంతే పేపర్ల నిండికి పోటాలు పడిపోతాయ్ గదా? దీన్ని ఏమంటారంటే పెట్టుబళ్లేని యాపారం అంటారు. తిరమల కొండ మింద వొంగబెట్టి సుద్దంగా గొరిగేసినట్టు యాడుండే చెట్లను ఆడ తీరుమానంగా నరికిపారేస్తా ఉంటే గండి పేట్లో ఒక చెట్టు తిరమల కొండ మింద ఒక మొక్కనాట్తే చినుకు నేల మింద రాలమంటే దాల్తిందా? ఇటుమంటి యాళలో చెవ్వల్లోనే చెట్లు మొలిస్తే...''

''చాల్సాలు. నీ యాసణ్ణం ఆడికి కట్టిపెట్టే! ఇప్పుడు జరిగే పని చూడు. నేనేందో ఒక పుస్తకం కత ఎత్తుకుంటే చెవల్లో చెట్లంట... సీమలో చినుకులంట!... మొగుడు చచ్చి మొత్తుకుంటా ఉంటే వాడెవుడో వచ్చి రాళ్లేసినట్టు!''

''రామ రామ! అంతమాట ఎందుకులేయే? ఒకేవొక్క వారందినాలు కాపీనీళ్లతో కాలం గడిపేస్తానంటే నాకేం అబ్బెంతరం లేదే? అప్పుడు నీ ముద్దుల కూతురికి వొగిటి కాకపోతే రొండు పుస్తకాలుగా కొనుక్కోవచ్చు!''

''ఎట్టమ్మా ఈ మొగోడితో? తలకేస్తే కాలికి. కాలికేస్తే తలకు!''

''నీ కూతురు చదవతా ఉండేది నీ మాదిర్తో నా మాదిర్తో వానాకాలం చదువుకాదే. అటుమంటి చదువులు చదివే బిడ్డకు ఎటుమంటి పుస్తకం కొనాల్నో నీ మొకం నీకేం తెల్సునే! తూకానికి పెట్తే ఎళ్లేదన్నా మూడు నాలుగు కిలోల బొరువుకు తక్కవగా వుండదే? అయినా నాకు తెలవక అడగతా వుండా. అంత లావు పుస్తకాన్ని మోసేదీ కష్టమే. కొనేదీ కష్టమే! ఒక్కడుగు అట్టపాయ్ నట్టుపాయ్ ఆ లైబ్రరీలో చూసుకోని రావచ్చుగదా?''

''రావచ్చు. రావచ్చు. ఎందుకు రారాదు? పోనీ నువ్వు ఎప్పుడైనా ఆ లైబ్రీ మొకం చూసినావా? ఆడ ఎట్టుండాదో తెల్సునా నీకు? గాలా? ఎల్తిరా? కూసుండే దానికొక కుర్సీయా? చదివి చదివి గొంతెండకపోతే తాగేదానికి రొన్ని మంచినీళ్లా? ఆడికిపోతే బిడ్డ సదిగినట్టే! కత ఆడికి కడతేరినట్టే!''

''అబ్బరంగా బిడ్డపుట్నాడు. గెడ్డపారెత్తుకోండి చెవులుకుద్దాం! అన్నెట్టుగా ఉంది నువ్వు చెప్తా ఉండేది. ఎంతోమంది మహన్నబావులు యీదల్లో మున్సిపాల్టీ లైట్లకింద కూసోని చదువుకోలేదా? వాళ్లేం పెద్ద పెద్ద చదువులు చదవలేదా? అంతకన్నా పెద్ద పెద్ద ఉద్దోగాలు చెయ్యలేదా? ఆ మాటకొస్తే నేను! – కోడిగుడ్డు దీపెం ముందర కూసోని గదంటే చదివింది. నా సామిరంగా! అర్దణాదుడ్లిస్తే కోడిగుడ్డు దీపెంనిండికి ఎర్ర కిర్సనాలు. ముట్టించి

పెట్టేసి ముందర కూసుంటే రైలింజన్లో పొగమాదిర్తో చిటికినేలు లావుతో నల్లంగా పొగపోతావుంటే... తెల్లవాదులు కంటి మింద రెప్పట్టా పడకుండా...''

''ఇంకేం సంబడం లేదబ్బా? మాటెత్తితేచాలు! నేను కోడిగుడ్డు దీపెం ముందర కూసోని చదివితి. దినానికి నాలుగు నాలుగు ఎనిమిది మైళ్లనడ్సి యిస్కూలికి పోతి. బానాతొండం పెట్టేదానికి కొత్త సెర్మం కొనుక్కోని రావాలని మా అయ్య చిత్తూరికి పొయ్యి వేలూర్లో రొండు రూపాయిలు సలీసంటే అణ్ణించి అట్నే వేలూరికి నడ్సె. అంటా గొప్పలకు పోతారు. నడ్సినాడంటే నడవకేం చేస్తాడు. అదొక కాలం. ఇదొక కాలం. ఆ ఎగ్రికాలంలో జరిగినట్టే యీ కాలంలో గూడా జరగాలంటే?''

''సరేలే! జరగదంటే జరగదు. ఈ కాలాన పుట్టింది మీ అదురుష్టం!''

''రామాయిణమంతా యిని రాముడు సీతకేంగావాలంటే ఎట్ల చచ్చేదబ్బా ఈ మొగోడితో? పుస్తకం కొనకుండాపోతే పీడాగిటి పొయ్యింది. ఆ లైబ్రీకి పో. అడుక్కుంటావో. అంగలారస్తావో. నాకు తెల్దు. ఆ పుస్తకం తీసుకోనిరా. బిడ్డ రొండుదినాలైనా చదువుకోని యిచ్చేస్తింది.''

''అట్లంటివా? బెమ్మాండంగా ఉండాది.'' అని మా బాశాలి తెలివి తేట్లకు ఒక సర్టిఫికెట్టు యిచ్చిపారేసి నేను లైబ్రీకి ఎలబార్నా.

అక్కడికి పొయ్ చూస్తే రామ రామ! ఎట్లని చెప్పమంటారు? ఆ లైబ్రీ ముందర సైకిళ్లు స్కూటర్లు గజాంబిజాంగా పెటేసుండారు. ఎట్నో దోవ చేసుకోని లోపలికి పొయ్యేకుందికి దోసిడు చెమట కారిపాయ. ఆడ నిలబడుకోని అట్టాయిట్టా చూసేకుందికి కాలవలుగట్టె. కూసోనుండేవాళ్లు వొకింత. నిలబడుకోనుండేది నాలుగింతలు!

ఒకడు కూసోని పేపరు చూస్తా ఉండాడు. వాడికి ఆపక్క యిద్దురు. ఈ పక్క యిద్దురు. ఎనక పక్కన ముగ్గురుగా నిలబడి ఆ పేపర్లోకి తొంగి తొంగి చూస్తా ఉండారు. ఈళ్లను తోసుకోని లోపలికి పోలేక బయిటికి రాలేక నడిమిద్దె తగులుకోని ఆడ పిలకాయిలు అవస్తపడ్తా ఉండారు. ఒక చిన్న అర. ఆ అరలోనే ముగ్గురో నలుగురో? అక్కణ్ణే పని చేసే వాళ్లగా ఉండారు. ఎవురెట్లబోతే మా కేం అన్నెట్టుగా తలకాయిలు కాయితాల్లోకి దూర్చేసినారు. ఆడ నిలబడి పరిస్తితి గెమనిస్తా ఉంటే వచ్చినపని కప్పతిని పాయ!

''గాలా? ఎల్తిరా? నీళ్లా నిప్పులా? ఏముండాదే ఆడ?'' అంటా మా బాశాలి ఎత్తి పొడిస్తే ఏమో అనుకుంటిగానీ చూస్తా ఉంటే మణుసు అదొక మాదిరైపాయ. తాడో పేడో తేల్సుకోవాలని తీరుమానం చేసుకుంటి. దీనికి అయ్య అని ఎవుడో ఒకడుండాలగదా?

ఆ అరలోనే ఒక మూలగా ఒక మణిసి కూసోనుండాడు. అంత పొడుగూకాదు. పొట్టీకాదు. సైకిల్ కట్టు కట్టుండాడు. మల్లి పూల్నే మరిపించే తెల్లజుబ్బా తొడిగుండాడు. కుర్సీలో తీరుబాటుగా కూసోని నెత్తిమింద నాలుగంటే నాలుగు ఎంటికిలు లేకుండాపొయ్‌నా మూతిమిందుండ్లా? అని మీసం వడేస్తా ఉండాడు.

''వాణ్ణీ యీణ్ణీ అడిగేదెందుకు? ఆ మొనగోణ్ణే కడిగేస్తే సరిపోలా?'' అనుకోని-

''ఏందయ్యా యిదెంతా? ఈడ కూసోని నువ్వు చేస్తావుండే ఉద్యోగం ఏందయ్యా? మీసాలు వడేసుకుండేదేనా?'' అని నేను శానా కోపంగా అంటే ఆ మొగలాయి ముసి ముసిగా నవ్వె.

''నేనడిగేదేంది? నువ్వు నవ్వేదేంది?'' అని దబాయించినట్టడిగితే-

''ఇర్వై అయిదేండ్లకైనా ఈ ఊళ్లో ఒక మొగోణ్ణి చూసినందుకు కుశాలగా ఉంటే?''

నాకు అరికాలి మంట ఉచ్చికెక్కె!

''ఏమంటివి? ఈ ఊళ్లోవాళ్లందురూ మొగోళ్లు కాదనా నువ్వనేది? నీకెన్ని గుండికాయిలు? యాణ్ణుంచో బతుక్కుండేదాని కొచ్చినోడివి. ఎంతదా పెద్ద పెద్ద మీసాలు నీకే వుంటే మాత్రం ఉండూరోళ్లను అంత మాటంటావా? నా దగ్గిరంటే అన్నావు. ఇంకెక్కడా అనబాక.'' అని అంటుకుంటి.

అయినా నాయాలు అదర్లా? బెదర్లా? నవ్వతానే-

''మీసాలేంది లేవయ్యా? రొయ్యగ్గూడా ఉంటాయి. ఈ ఊళ్లో ఇరవై అయిదేండ్లుగా ఈ లైబ్రీ ఈబాడిగ కొంపలోనే పడుండాది. ఇరవై అయిదేండ్లనాడు ఎంత బాడిగో యిప్పుడూ అదే బాడిగ. పాపం! వాళ్ల బాదలు వాళ్లవి. ఎత్తి యీదిలో పారేస్తా నంటారు. దాదాపు యాభైవేల పుస్తకాలు. ఎటుమంటి పుస్తకాలుండయో మీకేం తెల్సు? అన్నీ యీదుల పాలై పోతాయంటే కడుపు అట్నే రగిల్తింది. ఇట్నే యీడ పెట్టుకోని కూసుంటే చెదులు తినేసి పోతా ఉండాయి. అట్టపాయ్ చూడుబో. కుప్పలు కుప్పలుగా ఎట్ల పడుండాయో? పోనీ! చదువు కుందామని ఎవుడైనా వస్తే కూసుందామంటే కుర్సీలుండాయా? గాలీ ఎల్తిరుండాదా? ఇప్పుడు చెప్పయ్యా? ఈ ఊళ్లో మొగోళ్లు ఉన్నెట్టా లేనట్టా? నువ్వే చెప్పు?'' అనె మీసం మింద చెయ్యి దించకుండానే.

''ఊళ్లో మొగోళ్లా?- వాళ్లేం చేస్తారయ్యా? ఉద్యోగం చేస్తా ఉండేది నువ్వు. నెల పెట్టేకుందికి జీతం బిల్ ముక్తాగా తీసుకోని తింటా ఉండేది నువ్వు! ఈడ కత యిట్టుండాదని పైవాళ్లకు వొగిటికి పదిసార్లుగా రాసి పని చెయ్‌పించుకోవాల.''

''ఆపని గూడా చేసినాము. చేస్తా ఉండాము సామీ. చేస్తానే ఉండాము. ఏడేండ్ల కిందట్నే ఎండోమెంటోళ్లకు అచ్చిరాలా రొండున్నర లచ్చల రూపాయిలు చెల్లిస్తిమి. కొత్త బిల్డింగు కట్టుకుండేదానికి జాగాకోసరం!

ఆపొద్దు దమ్మిళ్లతోసహా దుడ్లు తీసుకుణ్ణారు. ఈ పొద్దు ఏమంటా ఉండారోతెల్సా? 'మీ దుడ్లు మీరు తీసుకోండి. మాజాగా మాకిచ్చేయండి!' అంటా ఉండారు. వాళ్లేగాని ఆ జాగాను అప్పుడే మా సోదీనం చేసేసుంటే యిప్పటికే ఈ ఊళ్లో బంగారట్టా లైబ్రీ ఉండేది.''

''అట్టా పనికి మాల్నె కూతలు వాళ్లు మాత్రం ఎట్టా కూస్తారయ్యా? వాళ్లనోళ్లల్లో ఉండేది నాలికేనా యింకేమన్నానా? దేవాదాయం దర్మాదాయం అని పేరు పెట్టుకోని యింత అదర్మానికి వొడిగట్తారా? నువ్వు చెప్పేది మరీ అరుసోద్దింగా ఉండాదే?''

ఆ మణిసి నన్ను ఎగాదిగా చూస్తా-

''అప్పిటికి నేను అపద్దం చెప్తావుండాననా నువ్వనేది! అయితే పాయ్ యిశారించుకో. పో. నామాట జల్లయితే నీ కాలికుండేది చేతికి తీసుకో!''

ఆ మణిసి అంత మాట అనేకుందికి నానోరు మూతపడిపాయ. గిరక్కుమని ఎనక్కి తిరిగితి. తిరిగీ మల్లి చూడకుండా ఎలబార్తి. నేరుగా నాలుగ్గాళ్ళమండపం కాడికొచ్చి నిలబడ్తి.

''ఏం బతుకులో గిరం సెన్నై బతుకులు? ఎంతకాలం బతికినా ఏమి లాబం? వాడా తిప్పయ్య? పొగులు చస్తే తలకాడికి వడ్ల గింజిల్లే. రేత్రి చస్తే దీపానికి సమ్మర్లే. అటుమంటోడు ఎవుర్ని పట్నాడో? ఎట్ట పట్నాడో? కాకా పట్టేసినాడు. దచ్చిణవాడ యాదిలో ఎండోమెంటోళ్ళ జాగా లీజుకు కొట్టేసినాడు. ఒకసమ్మత్సరానికా? రొండు సమ్మత్సరాలకా? తొంభై తొమ్మిది సమ్మత్సరాలకు! మొనగోడు షెడ్లు ఎయ్‌పించేసినాడు. బాడిగలకు వదిలేసినాడు. ఇప్పుడు కాలిమింద కాలేసి కూసోని తింటా ఉండాడు. వాడూ మొగలాయి. ఏపని చేసినా అట్టుండాల. ఒంటికి సెగ చేతికి మట్టి కాగూడదు.''

''వాడు ఒక యిదంగా మేలు. తాగేనీళ్ళల్లో అద్దలా. ఆ పక్కన్నే ఉండ్లా. లైబ్రీ కట్టేదానికి జాగా. దానిమింద ఏ రామయ్యకో రంగయ్యకో కన్ను పడిందో? మూట యిప్పాల్సిన చోట యిప్పేసి నట్టుండారు. ఇప్పుడు ఎండోమెంటోళ్ళు ఏమంటా ఉండారో తెల్సునా? ఎప్పుడో తీసుకున్నారే దుడ్లు ఆ వాపస్ యిచ్చేస్తారంట. వాళ్ల జాగా వాళ్ల కిచ్చేయాలంట.''

''కదా మరి? లైబ్రీ కట్టుకుండే దానికిస్తే బొచ్చా వస్తింది? అదే ఏ రామయ్యకో రంగయ్యకో యిస్తే?- రాల్నె కాడికి రాల్తింది.''

నాలుగ్గాళ్ళమండపం నలుగురి నోళ్ళల్లో సత్తాన్ని పలికిస్తా ఉండాది!

''దేవుడి పేరు మింద జరగతా ఉండే దర్మం యిదేనా?'' అని ఆలోచిస్తావుంటే ముత్తారెడ్డన్న వచ్చె.

''ఒరే అబ్బోడా! నీ బాద నాకు అర్తమయిందిరా! ఆలోచించకుండా బాదపడ్తే ఆరోగ్గానికి సెబ్బుర్రా! పిచ్చోడా లైబ్రీకి పోతే ఎవుడైనా ఏదో వొగిటి చదవనే చదవతాడు. చదివితే అంతో యింతో తెలివొస్తింది. తెలవయినోడు ఆలోచిస్తాడు. ఆలోచిస్తే ఏదిమంచి ఏది చెడ్డ? అని తెలిస్తింది. తెల్సుకుంటే ఊరికే ఉండమన్నా ఉంటాడా? ఉండడు. అటుమంటోళ్లు కాదునాయినా ఈ దేశానికి కావాల్సింది. ఏమి చేసినా ఎట్ట చేసినా నువ్వే దేవుడనేవాళ్లు కావాల. అందుకే మనోళ్లు గుళ్లు ఎన్నయినా కట్టేస్తారు. ఎందుకు? ఆడికిపోతే మణిసి ఏమవతాడు? అంతా దేవుడా! నువ్వే అంటాడు. అటుమంటోళ్లే మనకు కావాల్సింది కానీ నువ్వెవురని నిలదీసే వాళ్లుకాదు. సుద్ద ఎంబరెమ్మగా ఉండావే? ఆ మాత్రం ఆలోచించకుండా పోతే ఎట్రా?'' అనె.

''అవును గదా మరి? మన ప్రెబువులేమన్నా ఎర్రోళ్లా కొరివితో తలగోక్కుండే దానికి?'' అనుకుంటా ఎలబార్తి ఈదిలో జగడం యింటిదాకా మోసుకోని! ●